
# సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 2 । జూన్ । 2025



**సోమశిలలో 42.206 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 42.206 టీఎంసీలు ఉన్నాయి. 399 క్యూసెక్కుల వరద వస్తుండగా, డెల్టాకు 3180, ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.98,350 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.8,920 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.9,188 |
| నవర (8 గ్రా) | రూ.73,504 |

గరిష్టం/కనిష్టం 39.1 /28.6

**వాతావరణం**

ఉష్ణోగ్రతలు జిల్లాలో క్రమంగా మళ్లీ పెరుగుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 43 శాతంగా నమోదైంది.

# ఖాకీల.. పచ్చ భక్తి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడమే నేరమా?
- కూటమి నేతల కళ్లల్లో ఆనందం కోసం అక్రమ కేసులు
- నిరసనలోనే కాదు.. ఊర్లోనే లేని వ్యక్తులపై సైతం కేసు నమోదు
- పోలీసుల తీరుపై విమర్శల వెల్లువ

**నెల్లూరు పోలీసులు ఖాకీ చొక్కాలు తీసేసి.. పచ్చ చొక్కాలు తొడిగిన కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. కూటమి నేతల కళ్లల్లో ఆనందం కోసం ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. నిరసన తెలిపే హక్కు ఉంది. పోలీసులు పెట్టిన అక్రమ కేసులపై అత్యున్నత దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడమే నేరమన్నట్లుగా మరికొందరు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తాజాగా కేసులు నమోదు చేసి పచ్చభక్తిని చాటుకున్నారు.**


సాక్షిప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు శక్తికి మించి శ్రమిస్తున్నారు. నేతల ఆదేశాలు అందడమే ఆలస్యం సంబంధం లేని వ్యక్తులపై సైతం కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతున్నారు. తాజాగా మరో అడుగు ముందుకు వేసి కార్యక్రమంలోనే కాదు.. ఊర్లోనే లేని వ్యక్తులపై సైతం కేసులు నమోదు చేయడంను చూస్తుంటే కొందరు పోలీసుల తీరు తెన్నులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన విషయం విదితమే. దీన్ని నిరసిస్తూ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని శనివారం కాకాణి పూజిత, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడి అక్రమ కేసులను ఖండించారు. దీన్ని జీర్ణించుకోలేని కూటమి నేతలు చిన్నబజారు పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌కు వచ్చి వెళ్లే వారిని, సిబ్బందిని అడ్డగించి ఇబ్బంది కలిగిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరించారంటూ వైఎస్సార్‌సీపీ నేతలు మందల వెంకటశేషయ్య, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, రావుల ఇంద్రసేనాగౌడ్, షేక్ అబ్దుల్‌మస్తాన్, షేక్ సిద్ధిఖ్‌బాషా, బొబ్బల శ్రీనివాసయాదవ్, రావు శ్రీనివాసరావు అలియాస్ ఆర్ఎస్ఆర్, సత్తార్, మొయిళ్ల సురేష్, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డితోపాటు మరికొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**కార్యక్రమానికి హాజరుకాని వారిపై సైతం..**

ఆ కార్యక్రమంలో పాల్గొనని, ఊర్లోలేని వ్యక్తుల పేర్లను సైతం కేసులో పెట్టడం పోలీసుల పచ్చభక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మొయిళ్ల సురేష్, రావు శ్రీనివాసరావు సత్తార్ అసలు కార్యక్రమానికే హాజరు కాలేదు. బొబ్బల శ్రీనివాసయాదవ్, సురేష్ బయట ఊర్లకు వెళ్లగా, రావు శ్రీనివాసరావు తల్లి మరణించడం, సత్తార్ వ్యక్తిగత కారణాలతో రాలేదు.. అయినప్పటికీ పోలీసులు వారిపై కేసు నమోదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నాడు**

రేషన్ షాపులు ఎక్కడో ఒక చోట ఉంటాయి. పట్టణాల్లో కార్డుదారుడి ఇంటికి చౌకదుకాణానికి వంద మీటర్ల నుంచి కిలోమీటరు దూరం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే పంచాయతీ కేంద్రాల్లో దుకాణాలు ఉంటే.. నాలుగైదు కి.మీ. దూరంలో ఉండే మజరా గ్రామాల నుంచి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. డీలర్ అందుబాటులో లేకపోయినా.. ఈ పోస్ మెషీన్లు పనిచేయకపోయినా.. సర్వర్లు డౌన్ అయినా రోజుల తరబడి అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. కి.మీ. మోత కష్టాలు తీరుస్తూ ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ చేసే ప్రక్రియకు గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గతంలో షాపులకు వెళ్లి తెచ్చుకోలేని వాళ్లు సైతం రేషన్ బండి ఇంటి వద్దకే రావడంతో తీసుకుని వాడుకునేవారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి అవకాశం లేకుండాపోయింది.



**నేడు**

కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. గతంలో రేషన్ షాపులకు బియ్యం వస్తే డీలర్లు ఎండీయూ వాహనాల నిర్వాహకులకు అప్పగించేవాళ్లు. సరఫరా చేయగా మిగిలిన బియ్యాన్ని తిరిగి డీలర్లకు అప్పగిస్తున్న పరిస్థితి ఉండేది. అధికార పార్టీ ఎమ్మెల్యేలే రేషన్ మాఫియాగా అవతరించారు. గడిచిన ఏడాదిగా ప్రతి నెలా రేషన్ బియ్యం దుకాణాలకు చేరకుండానే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా రైస్ మిల్లులకు చేర్చుతున్నారు. దీంతో డీలర్ల వద్దకు బియ్యం చేరడం లేదు. డీలర్లు ఎండీయూ వాహనాలకు సరఫరా చేయడం లేదు. దీంతో ఎండీయూ వాహన నిర్వాహకులు ఎక్కడికక్కడ నిలదీస్తుండడంతో అధికార పార్టీ నేతల బియ్యం మాఫియా గుట్టు బయట పడుతుందనే నెపంతో ఎండీయూ వాహనాలకు అధిక ఖర్చు అవుతుందని డీలర్లకే అప్పగించింది.



నెల్లూరు లేక్‌వ్యూ కాలనీలో కార్డుదారుల బారులు

# కష్టాలు మళ్లీ మొదలు

- మొరాయించిన సర్వర్లు.. ఈ-పోస్ మెషీన్లు
- గంటల తరబడి బారులు తీరిన కార్డుదారులు
- మోసుకెళ్లలేక వృద్ధులు, మహిళల అవస్థలు

నెల్లూరు (పొగతోట): జిల్లాలో బియ్యం కార్డులదారులకు రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. డీలర్లు, బియ్యం మాఫియా అక్రమాలకు అడ్డుగా ఉన్న ఎండీయూ వాహనాలను 'ఖర్చు' పేరిట' కూటమి ప్రభుత్వం తొలగించింది. ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వ్యవస్థను రద్దు చేసి.. ఆదివారం నుంచి చౌకదుకాణాల వద్ద పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే మొదటి రోజే సర్వర్లు మొరాయించడంతో ఈపోస్ మెషీన్లు గంటల తరబడి పని చేయలేదు. దీంతో కార్డుదారులు నానా అవస్థలు పడ్డారు. ఒక్కో కార్డుదారుడికి రేషన్ పంపిణీ చేసేందుకు 10–15 నిమిషాల సమయం పట్టింది. పూర్తి స్థాయిలో డేటా లేక డీలర్లు సైతం నానా ఇబ్బందులు పడ్డారు. ఈపోస్ మెషీన్‌లో కార్డుదారుడి వివరాలు నమోదు చేశాక.. సర్వర్లు పనిచేయక.. సమయం మించిపోవడంతో మళ్లీ మళ్లీ పూర్తి వివరాలు నమోదు చేయడం, డబ్బుల చెల్లింపులు తదితర కారణాలతో గంటల తరబడి కార్డుదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఉదయం 6 గంటల నుంచి..**

జిల్లా వ్యాప్తంగా 1513 చౌకదుకాణాలు ఉండగా, 7,21,524 మంది కార్డుదారులు ఉన్నారు. జిల్లా అధికారులు ముందస్తుగా చౌకదుకాణాలన్నిటికీ రేషన్ సరఫరా చేసి సిద్ధంగా ఉంచారు. చాలా చోట్ల రేషన్ దుకాణాలకు కార్డుదారులు వెళ్లకపోవడంతో డీలర్లు ఎదురుచూపులు చూశారు. అత్యధిక ప్రాంతాల్లో ఉదయం 6 గంటలకే లబ్ధిదారులు రేషన్ షాపుల ముందు బారులు తీరారు. పౌరసరఫరాల శాఖ అధికారులు సర్వర్లు ఆన్ చేయకపోవడంతో గంటల తరబడి కార్డుదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కసారిగా సర్వర్ ఆన్ కావడం, డీలర్లు కార్డుదారుల డేటా ఎంట్రీ చేయడంతో పదేపదే సర్వర్లు మొరాయించాయి. ఇదే సమయంలో ఈపోస్ మెషీన్లు కూడా పనిచేయకపోవడంతో వాటి మరమ్మతులతో గంటల కొద్దీ ఆలస్యం అయింది. గతంలో ఇంటి ముందుకు వచ్చిన ఎండీయూ వాహనాల ద్వారా క్షణాల్లో సరుకులు తీసుకెళ్లిన లబ్ధిదారులు.. గంటల



నెల్లూరు రూరల్ పరిధిలోని మహాత్మాగాంధీనగర్‌లో సర్వర్ పనిచేయక బారులు తీరిన కార్డుదారులు

కొద్దీ పడిగాపులు పడుతూ కూటమి ప్రభుత్వం దుమ్మెత్తి పోయడం, శాపనార్థాలు పెట్టడం ప్రతి చోటా కనిపించింది. మరో వైపు ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఎండలో బారులు తీరాల్సి రావడంతో లబ్ధిదారులు అల్లాడిపోయారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 45 చౌకదుకాణాల్లో సాయంత్రం ఐదు గంటల వరకు రేషన్ పంపిణీ జరగలేదు. సగటున 7.5 శాతం మంది కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయగలిగారు.

**మాఫియా అక్రమాలకే..**

బియ్యం అక్రమ రవాణాకే ఎండీయూ వాహనాల అడ్డు తొలగించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్ల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులు ఇంటి వద్దనే రేషన్ అందుకుంటున్నారు. సమయం వృథా కాకుండా, ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి వద్దనే కార్డుదారులు రేషన్ అందుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి

| రేషన్ దుకాణాలు | బియ్యం కార్డులు | తొలి రోజు పంపిణీ |
|---|---|---|
| 1,513 | 7,21,524 | 7.5 శాతం |

ఏడాది కాలంగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ అరకొరగా జరుగుతోంది. కూటమి నేతల రేషన్ మాఫియా డీలర్ల వద్దకు బియ్యం సరఫరా చేయకుండా నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రైస్‌మిల్లులకు తరలిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి నెలా 80 శాతం రేషన్ బియ్యం దుకాణాలకు, కార్డుదారులకు చేరకుండానే రేషన్ మాఫియా విదేశాలకు ఎగుమతి చేస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంటే బియ్యం మాఫియాకు, డీలర్లు మధ్య ఎండీయూ వాహనాల నిర్వాహకులు అడ్డుగా ఉన్నారు. దీంతో ఎండీయూ వాహనాలను పక్కకు తప్పించాలని భావించిన కూటమి ప్రభుత్వం ఖర్చు తగ్గించడం కోసమే అంటూ దుష్ప్రచారం చేస్తూ మంగళం పాడింది. దీంతో కార్డుదారులకు మరలా కష్టాలు మొదలయ్యాయి. దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేస్తామని ప్రచారం చేశారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో వృద్ధులు సైతం రేషన్ షాపుల వద్ద క్యూ కట్టారు. అవ్వాతాతలు గంటల తరబడి దుకాణాల వద్ద వేచి ఉండి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. డీలర్లు సరైన తూకాలు తూయకుండా ఈపోస్ బిల్లులు లేకుండానే అనేక మందికి రేషన్ పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి తంతు అధికంగా జరిగింది.

**నాకే అమ్మాలి.. లేదంటే పథకాలు రావు**

వలేటివారిపాళెం: ఆదివారం నుంచి ప్రారంభమైన సరుకుల పంపిణీలో రేషన్ షాపుల్లో అప్పుడే అధికార పార్టీకి మద్దతు తెలిపే డీలర్లు బెదిరింపులు ప్రారంభించారు. కాకుటూరులో ఓ రేషన్ షాపు డీలర్ మరో అడుగు ముందుకేసి మీరు ఎలాగో ఈ బియ్యాన్ని వాడుకోరు. తప్పకుండా నాకే ఈ బియ్యం అమ్మాలి. లేకుంటే ప్రభుత్వం అందజేస్తున్న రేషన్, సంక్షేమ పథకాలు కూడా అందకుండా చేస్తానని బెదిరింపులు చేస్తున్నాడని లబ్ధిదారులు ఆరోపించారు.



అంకభూపాలపురం నుంచి రేషన్ బియ్యం మోసుకుపోతున్న 75 ఏళ్ల వృద్ధురాలు తిరుపతమ్మ

**కష్టంగా ఉంది**

ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు గోసాల చిన్నమ్మ. కలిగిరి అరుంధతీయవాడ.. రేషన్ సరుకుల కోసం ఉదయాన్నే చౌకదుకాణం వద్దకు చేరుకుంది. సర్వర్ పని చేయకపోవడంతో ఆలస్యంగా 11 గంటల సమయంలో ఆమెకు సరుకులిచ్చారు. 'గతంలో రేషన్ బండి ఇళ్ల వద్దకు వచ్చి ఇచ్చేది. ఏ ఇబ్బంది లేకుండా తీసుకునేదాన్ని. ఇప్పుడు మేమే షాపు వద్దకు వెళ్లాలంట. ముసల్లోం నడవలేక ఇలా దుకాణానికి వచ్చి సరుకులు తీసుకెళ్లాలంటే కష్టంగా ఉంది. ఇచ్చిన బియ్యం కూడా కొంత అక్కడే ఉంచా. ఎవరైనా తెచ్చిస్తారంటూ వెళ్లిపోయింది.





నెల్లూరు లేక్‌వ్యూ కాలనీలో మహిళ అవస్థ



మహాత్మాగాంధీనగర్‌లో వృద్ధురాలి కష్టం



మూలాపేటలో ఈపోస్ మెషీన్ రిపేరు..



మధ్యాహ్నం అయినా తెరుచుకోని ఉలవపాడులో 1వ నంబరు షాపు



వృద్ధుడు వెంకటేశ్వర్లు అవస్థలు

**రేషన్ కోసం అవస్థలు**

ఇదిగో.. ఇది కలిగిరిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో ఏర్పాటు చేసిన చౌకదుకాణం. ఈ షాపు పరిధిలో సుమారు 1,200 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ నెల నుంచి రేషన్ సరుకులు చౌకదుకాణాల వద్ద నుంచి ఇస్తుండడంతో ఉదయాన్నే పలువురు వచ్చారు. సర్వర్ పని చేయకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు. రేషన్ సరుకులు ఇవ్వాలంటే కచ్చితంగా సెల్‌ఫోన్ నంబరు ఉండాలని చెప్పడంతో చాలా మంది మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇళ్లకు వెళ్లి ఫోన్ తీసుకుని రావాల్సి వచ్చింది. దీంతో కార్డుదారులు ఇబ్బందులు పద్దారు. ఎండ తీవ్రతకు కూడా ప్రజలు అవస్థలు పద్దారు. – కలిగిరి



కలిగిరి చౌకదుకాణం వద్ద ఎండలో కార్డుదారుల ఇబ్బందులు

# పథకాలకు బాబు వెన్నుపోటు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి
- అర్జీ ఇచ్చే స్వేచ్ఛ కూడా ప్రజలకు లేదా? : కాకాణి పూజిత
- వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చంద్రబాబు రాజకీయ జీవితం వెన్నుపోటుతోనే మొదలైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సైతం వెన్నుపోటు పొడిచి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని నెల్లూరు నగర వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దుయ్యబట్టారు. జూన్ 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' పోస్టర్‌ను ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆ నాడు రామారావుకు వెన్నుపోటు, తర్వాత రూ.2లకే కిలో బియ్యం, మద్య నిషేధం, ఉచిత విద్యుత్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. అధికారం దక్కించుకోవడానికి కలిసొచ్చిన 'వెన్నుపోటు' విధానాన్ని ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మారి ఉంటారని ఆయన ఇచ్చిన హామీలను నెరవేస్తారని నమ్మి ఆయనకు అధికారం కట్టబెడితే పాత బుద్ధి పోనిచ్చుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయమని గొంతు ఎత్తితే వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి జైలుకు పంపించి భయపెట్టాలని చూస్తున్నారని, ఈ రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలను చూసి దేశంలోని ప్రజలు విస్తుపోతున్నారున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులుగా మేము ప్రజల్లోకి తలెత్తుకుని వెళ్లగలుగుతున్నామంటే అది మా నాయకుడు చేసిన సుపరిపాలన అన్నారు. అదే ఈ రోజు టీడీపీ నాయకులు ప్రజల్లోకి వచ్చి తలెత్తుకోలేని పరిస్థితి ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాదైన నేపథ్యంలో ఈ నెల 4న 'వెన్నుపోటు దినం'గా ప్రకటించి ప్రజలతో కలిసి ఉద్యమబాట పట్టబోతున్నట్లు పేర్కొన్నారు.



వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత, వైఎస్సార్‌సీపీ నేతలు

**అధికారులకు వినతిపత్రం ఇస్తే కేసులా?**

- కాకాణి పూజిత

ఆదరించిన పార్టీకి, అధినేతకు వెన్నుపోట్లు పొడవడం చూశాం. తాజాగా గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడవడం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామని కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత అన్నారు. ప్రజలకు జరిగిన అన్యాయాన్ని, మోసాన్ని నిలదీసిన మా నాన్న గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ నాతోపాటు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన నాయకులపై కేసులు పెట్టడం చూస్తే కూటమి నేతలు, పోలీసులు ఎంతకు బరితెగిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చే స్వేచ్ఛ కూడా ప్రజలకు లేదా అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని జైల్లో పెట్టడానికి ఉన్న ఆసక్తి, ప్రజలకు మంచి చేయడంలో చూపించాలన్నారు. అధికారులు ఇలాంటి కక్ష పూరిత చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని కాకాణి గోవర్ధన్‌రెడ్డి అందుబాటులో లేకపోయినా విజయవంతం చేసి కూటమి కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గం నుంచి కూడా భారీగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# లక్షల గొంతుకలై నిలదీస్తాం

- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులా?
- ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో ప్రజల వాణిగా మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వినిపిస్తున్న గొంతును అక్రమ అరెస్ట్‌లతో నొక్కేస్తే.. లక్షల గొంతుకలై ప్రజలు నిలదీస్తారని, గర్జిస్తారని ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ అహ్మద్ చెప్పారు. అక్రమ అరెస్ట్‌లతో ప్రశ్నించే గళాన్ని నొక్కాలనుకోవడం అమాయకత్వమే అవుతుందన్నారు. కాకాణి అక్రమ అరెస్ట్‌ను జిల్లా వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఖలీల్ అహ్మద్ మైనారిటీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో కూటమి దాష్టీకాలపై ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా అక్రమ అరెస్ట్‌లు చేయాలనుకుంటే అది సాధ్యం కాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాట పటిమను నరనరాన జీర్ణించుకున్న పార్టీ శ్రేణులు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగానే ఉన్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. న్యాయ వ్యవస్థపై మాకు నమ్మకం ఉందని, కాకాణి తప్పకుండా క్లీన్‌చిట్‌తో బయటకు వస్తారన్నారు.

**సోమిరెడ్డి అరాచకాలను ప్రశ్నిస్తున్నారనే..**

వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్‌ఖాన్ మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి అక్రమాలను, అరాచకాలను ప్రశ్నించినందుకే కాకాణిని అక్రమ అరెస్ట్ చేశారన్నారు. జిల్లా రాజకీయాల్లో ఎన్నో ప్రముఖ కుటుంబాలు రాజకీయం చేసినప్పటికీ ఇటు వంటి నీచ రాజకీయాలు ఎన్నడూ చూడలేదని, కాకాణి అక్రమ అరెస్ట్‌ను ఖండించే ప్రతి గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు.

➡ ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్ మస్తాన్ మాట్లాడుతూ కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రజల మనిషి. ఎవరికి ఎటువంటి కష్టం నేనున్నానని ముందు నిలబడే వ్యక్తి అన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిది చాలా నీచ చరిత్ర అని, 1983లో ఎన్టీఆర్ పంచన చేరి పదవులు పొందిన సోమిరెడ్డి తర్వాత కాలంలో చంద్రబాబు పంచన చేరి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వ్యక్తుల్లో సోమిరెడ్డి ఒకరన్నారు.

➡ కార్పొరేటర్ సత్తార్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులు నొక్కాలని ఇటువంటి అక్రమ కేసులు పెడుతున్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమానికి తాను వెళ్లకపోయినా నా మీద కేసు పెట్టడం జరిగిందని, ఆ సమయానికి నేను ఆరోగ్యం బాలేక ఇంట్లోనే ఉన్నానన్నారు.

➡ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్ధిక్ మాట్లాడుతూ కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ముస్లిం వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందన్నారు. ఆయన అక్రమ అరెస్ట్‌ను అందరూ ఖండిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నేతలు మస్తాన్, జహీద్, ఇబ్రహీం, మీరా, షఫీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు

## క్లుప్తంగా

### కండలేరులో 40.370 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 40.370 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

### 8న శ్రీవారికి చందనాలంకరణ

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తికి ఈనెల 8వ తేదీన చందనాలంకరణ చేయనున్నట్లు దేవస్థాన అధికారులు ఆదివారం తెలిపారు. ఆరోజు స్వాతి నక్షత్రం స్వామి జన్మనక్షత్రం కావడంతో మూలమూర్తికి ఉదయం వివిధ పూజలు చేస్తామన్నారు. 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### సర్‌ప్లస్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ..



నిరసన తెలుపుతున్న నాయకులు

నెల్లూరు(టౌన్): జీఓను అతిక్రమించి 196 మంది ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా ప్రకటించిన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు దశరథరాములు, ప్రధాన కార్యదర్శి హజరత్ డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ ప్రాథమిక స్కూల్స్ ప్రధానోపాధ్యాయులుగా ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌ను కలిసినా పట్టించుకోలేదన్నారు. జీఓ తీసుకొచ్చి స్కూల్ అసిస్టెంట్లను సర్‌ప్లస్‌గా ఉండే విధంగా చేశారన్నారు. జిల్లాలో 196 మందిని సర్‌ప్లస్‌గా ప్రకటించిన అధికారులు బదిలీ దరఖాస్తు ముగిసినా వారిని చేసుకోమని బలవంతం చేస్తున్నారన్నారు. టీచర్లను మిన హాయిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి నుంచి హామీ లభించడంతో సోమవారం నాటి నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నట్లు వెల్లడించారు.

### గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్ల సీజ్

నెల్లూరు సిటీ: పొదలకూరు మండలంలోని వరదాపురం నుంచి నెల్లూరు వైపు వస్తున్న 5 టిప్పర్లను రూరల్ పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వరదాపురం నుంచి రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు మీదుగా నెల్లూరు వైపు అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్న ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి యజమానులు, ఐదుగురు డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

### ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు


- భార్య మృతి
- భర్తకు గాయాలు



మహిళ మృతదేహం

దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల జాతీయ రహదారిపై ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై జంపాని కుమార్ కథనం మేరకు.. దీపు శర్మకు రెండు వారాల క్రితం వివాహమైంది. భార్యతో కలిసి బెంగళూరు నుంచి విజయవాడకు కారులో బయలుదేరాడు. ఉలవపాళ్ల వద్దకు చేరుకోగానే వాహనం నడుపుతున్న శర్మ నిద్రమత్తులోకి జారుకున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఇసుకలోడుతో కావలికి వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ట్రాక్టర్ ట్రక్కు కింద ఇరుక్కుని భార్య అక్కడికక్కడే మృతిచెందగా శర్మకు తీవ్ర గాయాలయ్యాయి. మొబైల్, దగదర్తి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకి తీశారు. తీవ్రంగా గాయపడిన శర్మను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉందని, బంధువులకు సమాచారం అందించామని ఎస్సై తెలిపారు.

# 'జూన్' టెన్షన్




నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల అనంతరం కళాశాలలు, పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి ఇంటర్ తరగతులు మొదలవుతాయి. ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు తెరుచుకుంటాయి. 16 నుంచి డిగ్రీ తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చేనెల నుంచి మొదలవుతున్నా ఈ నెలలోనే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అసలే కూటమి ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాల్లేవు. వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలో డబ్బు ఎక్కడి నుంచి తేవాలో అర్థంగాక తల్లిదండ్రులు లోలోన మదనపడుతున్నారు.

**జిల్లాలో ఇలా..**

జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాల్లో జిల్లాకు సంబంధించి 3 లక్షల మందికి పైగా విద్యార్థులు విద్యాసంస్థల్లో ఉన్నారు. 960కు పైగా కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిల్లో 1.70 లక్షల మంది చదువుతున్నారు. ఇక 162 కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 42 వేల మందికి పైగా చదువుతున్నారు. ఇంకా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 3 ఏళ్లు కలిపి 25 వేలమందికి పైగా, ఇంజినీరింగ్‌కు సంబంధించి ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని ప్రైవేట్ కళాశాలల్లో 4 వేల మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. మిగిలిన విద్యార్థులు ఎంసీఏ, ఎంబీఏ, సీఏ తదితర కోర్సులు చదువుతున్నారు.

**తడిసిమోపెడు**

ఏటా పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు, పాఠశాల, కళాశాల స్థాయిని బట్టి రూ.30 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు పెద్ద కార్పొరేట్ స్కూల్లో చదివించాలంటే సంవత్సరానికి సంస్థను బట్టి సుమారు రూ.2 లక్షలు, అదే జూనియర్ కళాశాలలో అయితే రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు, పొరుగు రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కళాశాలలో అయితే రూ.5 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంటే మొత్తంగా పేరున్న స్కూల్, జూనియర్, ఇంజినీరింగ్ కళాశాలలో చదివించాలంటే ఒక్కొక్కరికి దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు అప్పు చేసేందుకు సిద్ధపడుతున్న పరిస్థితి ఉంది. ఫీజుల తోపాటు యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీ, బ్యాగ్‌లు తదితరాలకు ఏటా అదనంగా రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు ఉంటుంది.

**వసతులు శూన్యం**

తల్లిదండ్రుల ఆశలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. గాలి, వెలుతురు సక్రమంగా లేని అపార్ట్‌మెంట్లలో తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి ఎంచక్కా ఫీజులు దండుకుంటున్నారు. హాస్టల్స్ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతతో కూడిన భోజనం ఉండదు. అందరూ ఎక్కువగా కళాశాలల్లో ఏర్పాటు చేసే క్యాంటీన్లపైనే ఆధార పడుతుంటారు. పిల్లలు ఉండలేమని చెప్పినా సర్దుకుని చదివి బయటకు రా అని చెబుతున్న పరిస్థితి ఉంటుంది. యాజమాన్యాలు చదువు పేరుతో ఏటా రూ.వందల కోట్ల వ్యాపారం చేస్తున్నాయి.




**కమిటీ వేయాలి**



కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై కమిటీ నియమించాలి. పాఠశాలలు, కళాశాలల్లో తరగతి గదులు, హాస్టల్స్ గదులు, భోజనం అధ్వానంగా ఉంటాయి. జిల్లా స్థాయిలో కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో వసూలు చేస్తున్న ఫీజులు, నిర్వహణపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు కమిటీని నియమించాలి.

– పి.సాయిఆదిత్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్యార్థి జేఏసీ

**ఎక్కడా లేని విధంగా..**



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో డిస్‌ప్లే చేసేలా చర్యలు తీసుకోవాలి. వసూళ్లకు తగిన సౌకర్యాలు ఉండటం లేదు. తల్లిదండ్రుల ఆశలను ఫీజుల రూపంలో క్యాష్ చేసుకుంటున్నారు.

– లీలామోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సవ్యాంధ్ర జేఏసీ

### విద్యావ్యవస్థను కాపాడుకుందాం

- నెల్లూరులో రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నెల్లూరు(టౌన్): పిల్లల భవిష్యత్ కోసం విద్యావ్యవస్థను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు సమైక్య శంఖారావం పూరించాల్సిన అవసరం ఉందని వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, విద్యావేత్తలు పిలుపునిచ్చారు. నెల్లూరు ఆదిత్యనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు నరహరి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009ను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. అసర్ 2024 నివేదికపై బహిరంగ చర్చ జరగాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ తీరు, రీవాల్యుయేషన్ ఫలితాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఫీజుల నియంత్రణ చట్టం అమలు, అందరికీ సమాన విద్య అందించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం, తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ సంస్థలతో నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాలకు చెందిన కోటా శ్రీనివాసులురెడ్డి, ఉడతా రాజశేఖర్‌యాదవ్, మహేష్‌కుమార్, నవకోటేశ్వరరావు, చలపతి, శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, మస్తాన్, మున్నా, ఆదిత్యసాయి, నిహాల్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

### పొదలకూరు నిమ్మధరలు(కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



# దమ్ముంటే కేసును సీబీఐకి అప్పగించాలి

- మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి



కాకాణి కుమార్తె పూజితతో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి రిమాండ్‌కు పంపించడం కాదని, చంద్రబాబు, లోకేశ్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే సీబీఐకి కేసును అప్పగించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరు డైకస్‌రోడ్డులో ఉన్న కాకాణి గృహానికి ప్రసన్న తన కుటుంబ సభ్యులతో ఆదివారం వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవర్ధన్‌రెడ్డి నిత్యం ప్రజల కోసం పోరాడే వ్యక్తి అని, అందరూ బాగుండాలని పార్టీ పటిష్టంగా ఉండాలని కోరుకునే వ్యక్తిపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కొడుకు చేస్తున్న అరాచకాలను కాకాణి ఎండగడుతుంటే సహించలేక అధికారాన్ని అడ్డం పెట్టుకుని కక్ష సాధిస్తున్నారన్నారు. తిరిగి తమ ప్రభుత్వం వస్తుందని, ఇంతకు రెట్టింపు పని పడతామని, వదిలే ప్రసక్తే లేదన్నారు. సీబీఐకి కేసును అప్పగించాలని కాకాణి కుమార్తె పూజిత ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారన్నారు. ప్రభుత్వం మీదే కాబట్టి ధైర్యం ఉంటే మోదీకి చెప్పి కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. కాకాణికి మంచి పేరుందని, త్వరలో నిజాయతీగా బయటకు వస్తారని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పూజితకు ధైర్యం చెప్పిన వారిలో ప్రసన్న సతీమణి గీతారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి పూజారెడ్డి ఉన్నారు.



# మలేరియా నిర్మూలనకు చర్యలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్ఓ వి.సుజాత పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నెల్లూరులోని వైద్యశాఖ కార్యాలయం నుంచి సంతపేటలోని పలువీధుల మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. మలేరియా వల్ల చలి, వాంతులు, వణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం వస్తుందన్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో లక్షణాలు బయట పడతాయని తెలిపారు. వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయటపడొచ్చన్నారు. ఒక్కోదఫా ప్రాణాంతకంగా మారుతుందన్నారు. మలేరియాను నివారించాలంటే దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూసుకోవడమే సరైన మార్గమన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, మలేరియా సహాయ అధికారి నాగార్జునరావు, పీఎంపీ, ఆర్ఎంపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### భార్యపై భర్త హత్యాయత్నం



ఆస్పత్రిలో బాధితురాలు

నెల్లూరు(క్రైమ్): అనుమానం పెనుభూతంలా మారి పచ్చని సంసారంలో చిచ్చు రాజేసింది. భార్యపై మచ్చుకత్తితో భర్త దాడి చేసిన ఘటన నెల్లూరు రామ్మూర్తినగర్‌లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం సిద్దివరపుపాడుకు చెందిన రమకు కావలికి చెందిన బి.శ్రీనాథ్‌తో 2017లో వివాహమైంది. గ్రామికనగర్‌లో కాపురం పెట్టారు. వారికి ఇద్దరు సంతానం. శ్రీనాథ్ ఆటో నడుపుతుంటాడు. మద్యానికి బానిసైన అతను సంపాదించిన మొత్తాన్ని తన అవసరాలకు వాడుకోసాగాడు. భార్యపై అనుమానం పెంచుకుని తరచూ కొట్టడం, పెద్దలు సర్దిచెప్పడం జరుగుతోంది. రెండునెలలుగా రమ భర్త, పిల్లలతో కలిసి పొదలకూరురోడ్డులోని తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. ఆమె రామ్మూర్తినగర్‌లోని హెచ్ఆర్ పర్మినెంట్ మేకప్ సెలూన్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. రోజులానే ఆదివారం స్కూటీపై సెలూన్‌కు వెళ్లింది. పక్కనే ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం వద్ద వాహనాన్ని పార్క్ చేసి బ్యాగ్ తీసుకుంటుండగా శ్రీనాథ్ ఒక్కసారిగా మచ్చుకత్తితో ఆమె తలపై, కుడి భుజం, ఎడమచేయి మణికట్టు మీద నరికి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె అక్కడే కుప్పకూలింది. సెలూన్ మేనేజర్ సమీర్, సోనోవిజన్‌లో పనిచేస్తున్న అమూల్య మరికొందరు రమను చికిత్స నిమిత్తం జయభారత్ హాస్పిటల్లో చేర్పించారు. సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు హాస్పిటల్‌కు చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. ఆమె ఫిర్యాదు మేరకు శ్రీనాథ్‌పై హత్యాయత్నం, వేధింపుల కేసు నమోదు చేశారు.

### బులియన్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటీ ఏర్పాటు



అసోసియేషన్ నూతన కమిటీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఆచారివీధిలోని నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం ది నెల్లూరు డిస్ట్రిక్ట్ బులియన్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మూడేళ్ల పాటు కొనసాగే (2025 – 2028) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాశ్వత అధ్యక్షుడిగా శాంతిలాల్ జైన్, శాశ్వత చీఫ్ ఆర్గనైజర్‌గా మణిలాల్‌జైన్, ఉపాధ్యక్షుడిగా జేఎల్ సత్యం, ప్రధాన కార్యదర్శిగా ఆర్కాట్ శ్రీనివాసులు, కోశాధికారిగా కైలాష్‌జైన్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్‌జైన్, కన్వీనర్‌గా జె.కిశోర్‌కుమార్, అడ్వైజరీ కమిటీగా జి.శంకర్‌లాల్‌జైన్, డి.ప్రభాకర్, అలిమెలి సుబ్రహ్మణ్యం (మణి), ఎంపీ ఆంజనేయులు, ఫయాజ్‌లను ఎన్నుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది సభ్యులు విచ్చేశారు. మరో రెండు రోజుల్లో కమిటీ సమావేశమై ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని శాంతిలాల్‌జైన్, శ్రీనివాసులు తెలిపారు.

# విద్యార్థుల సంక్షేమానికి కృషి

- మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న పార్థసారథి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. యాదవ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేశారు. దీనికి విచ్చేసిన మంత్రి విలేకరులతో మాట్లాడారు. యాదవ కులస్తులతోపాటు ఎస్సీ, బీసీ, మైనారిటీల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందించినందుకు ట్రస్ట్ వారిని మంత్రి అభినందించారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించిందన్నారు. పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాత మంత్రివర్గంలో చర్చించి వీలైనంత త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు కానిస్టేబుల్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సంగం: సంగం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కోర్టు కానిస్టేబుల్ తన వదినకు డబ్బులిప్పించి మోసం చేశాడని అన్నారెడ్డిపాళెం, బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన పలువురు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం సంగం ఎస్సై రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటబాబు అన్నారెడ్డిపాళెంలో నివాసముంటున్న తన వదిన శైలజకు నాలుగేళ్ల క్రితం బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి శ్రీనివాసరావు నుంచి రూ.6 లక్షలు ఇప్పించాడు. ఆ సమయంలో ఆమె బ్యాంక్‌లో బంగారాన్ని విడిపించి మరుసటి రోజు నగదు ఇస్తామని నమ్మబలికాడు. శైలజ బంగారం విడిపించి డబ్బు ఇవ్వడానికి కాలయాపన చేసింది. పలుదఫాలు వెంకటబాబును డబ్బు అడగ్గా పోలీస్‌నంటూ బెదిరించేవాడని బాధితుడు వాపోయాడు. కొద్దిరోజుల తర్వాత శైలజ నుంచి శ్రీనివాసరావుకు ప్రాంసరీ నోట్లు ఇప్పించాడు. ఏడాది తర్వాత శ్రీనివాసరావు లైంగికదాడి చేయబోయినట్లు శైలజ చేత బుచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాడు. జరిగిన విషయాన్ని శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు వివరించినా ఫలితం లేకుండా పోయింది. రెండేళ్ల క్రితం అన్నారెడ్డిపాళేనికి చెందిన సుశీలమ్మ అనే మహిళ శైలజకు రూ.3.50 లక్షలిచ్చింది. నాలుగు రోజుల క్రితం ఆమె డబ్బులు తిరిగి అడిగింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. శైలజను సుశీలతోపాటు మరికొందరు కొట్టారని సంగం పోలీస్‌స్టేషన్లో వెంకటబాబు అక్రమ కేసు నమోదు చేయించాడు. దీంతో బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కొంత మంది బాధితులు ఆదివారం శైలజ అనే మహిళ రూ.20 లక్షలు తమ వద్ద తీసుకుని, అడిగితే అట్రాసిటీ కేసు పెట్టిస్తానని బెదిరిస్తోందని కన్నీరుమున్నీరవుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ముందు వాపోయారు. అన్నారెడ్డిపాళెంలోని టీడీపీకి చెందిన చోటా నాయకుడి అండతో శైలజ పలువురిపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎస్సై తెలిపారు.